# గలగలా గోదారి

శ్రీరమణ

## మున్సబ్ గారంటే...

అవి దొరతనం వారి రోజుల్రా అబ్బాయ్. గొడ్డు మాంసం తిని, మొద్దుబారిపోయిన నాలికలతో కాస్, పీస్ అని మాట్లాడుతూ గీసేసిన కంద దుంపల్లాగా, తొక్క వూడదీసిన శ్వేత వరాహాల్లాగా వుండే దొరలకి, భారతీయులందరూ అనాగరికులుగానూ, సంస్కార హీనులుగాను కనిపించే వార్రా. ఎదుటి వారిని గౌరవించడం, పెద్దలయెడ వినయంగా వుండటం, అరదేశి, పరదేశి వ్యక్తుల్ని ఆప్త బంధువుల్లా ఆదరించటం, ఎదుటి వారి ఔన్నత్యాన్ని బహిర్గతం వెయ్యడం కోసం, తాము ప్రతిభావంతులై వుండికూడా ఒదిగి వుండటం, అనే టటువంటి గుణాలు స్వతసిద్ధాలు, సహజ గ్రంథాలూ అయిన భారతీయులది బానిస మనస్తత్వంగా తోచేదను కుంటాను ఆ తెల్ల మనుషులకి. దానికితోడు యావత్భారత దేశంమీద వారి పరిపాలనాధిపత్యం కుదురుకుని వుండటం వల్లనూ, తాము చాలా వున్నతులమనే భావన ఆ తెల్లమనుషులలో కలిగిందిరా అబ్బాయ్. ఆయా కారణాలచేత తెల్లదొరలు బిర్రుగా వుండేవార్రా.

అటువంటి దొరతనంవారి కొలువులో, వారి పరిపాలనా యంత్రాంగాన్ని సవ్యంగా నడిపించటానికి, మరమేకుల్లాగా, చక్రాల్లాగా చాలా మంది భారతీయులు పనిచేస్తూ వుండేవార్రా. అలా కొలువు చేస్తున్న వారిలో, ప్రస్తుతం మన కథా హేతువైన కన్నబాబుగారీ కర్రా, అబ్బాయ్. యంత్రంలో మర మేకులు, చక్రాల్లాంటివి చాలా వుంటాయి. అవి క్రమబద్ధంగా తమ విధి తాము నిర్వహించుకుంటూ పోతాయ్. కానీ, వాటిల్లో కొన్ని వుంటాయి చూడు, అవి స్వతంత్రంగా సంచరిస్తూ ప్రధానమైన యంత్రాన్ని చీకాకు పెడుతూ వుంటాయి. అదిగో అటువంటి స్వతంత్ర ప్రతిపత్తిగల వారురా అబ్బాయ్ కన్నబాబుగరాంటే .

సరే విషయంలోకి వద్దాం.

భీమవరం కోర్టుకి మున్సిఫ్‌గా వుండే వార్రా కన్నబాబుగారు. న్యాయ నిర్ణయంలో స్వపర భేదాలు పాటించడంకానీ, సమయానుకూలంగా చట్టాన్ని అన్వయించడంగానీ, ఆయనకి అలవాటు లేదురా అబ్బాయ్. మహారాజైనా, మామూలు మనిషైనా ఆయన దృష్టిలో ఒక్కటే. న్యాయ పీఠం మీద న్యాయ నిర్ణయం వెయ్యడానికంటూ ఆయన కూచున్న తర్వాత, న్యాయ నిర్ణయం నిష్పేచీగా వెయ్యడమే తప్ప, మరో విధంగా జరగటం ఆ ఫిర్కా చరిత్రలో లేదురా. అందువల్ల కన్నబాబుగారంటే దొరలకి కూడా కించిత్ భయభక్తులుండేవి.




భీమవరానికి రాడ్ అనే ఆంగ్లేయుడు కలెక్టరుగా వుండేవాడు. అతగాడికి జాత్యహంకారం మోతాదుని మించే వుండేదిరా అబ్బాయ్. సదరు రాడ్ దొరగారికి, ఏ కారణం చేతనో ఫతేపురం రాజావారి మీద ఆగ్రహం కలిగిందిరా.

ఫతేపురం రాజావారు పండిత పోషకులనీ, ధార్మికులనీ ఆ పరగణాలో ప్రసిద్ధి పొందిన వారురా అబ్బాయ్. ఆంగ్లేయుల పాలనలో రాజులు, రాజ్యాలు భ్రష్టు పోయాయిరా. పౌరుషాలు మటుకు భ్రష్టు పట్టలేదురా. అందువల్ల రాజావారికి, రాడ్ దొరగారికి సామరస్యం కుదిరిందికాదు.

రాడ్ దొరగారికి, ఫతేపురం రాజావారిమీద ఆగ్రహం కలిగిందనుకున్నాం కదా. సదరు ఆగ్రహ కారణంగా, రూల్సు వదివి, వీలైనంత వరకు ఆ రూల్సు పరిమితిలోనే వాటికి వక్ర భాష్యం చెప్పకుని, కేవలం రాజా వారిని సాధించాలనీ, దెబ్బ కొట్టాలనే వుద్దేశ్యంతో పన్ను వెయ్యడమూ, ఆ పన్ను ఫలానా సమయంలోగా వసూలు కాకపోతే, ఆస్తిని జప్తు వెయ్యాలనే తాఖీదుని జారీ వెయ్యడమూ జరిగిందిరా అబ్బాయ్.

రాడ్ దొరగారు వేసిన పన్ను వ్యవహారం రాజా వారికే మాత్రం నచ్చలేదురా. 'కట్టను' అని ఖచ్చితంగా చెప్పడానికి కుదరదాయె. దొరలు రూల్సు మనుషులుకదా. కుక్కని చంపాలంటే అది పిచ్చి కుక్క అని ముద్ర వేసి, ఆపైన దానిని చంపాలన్నది దొరల ఆనవాయితీ. కనుక ఏ పని చెయ్యాలన్నా ముందొక చట్టాన్ని చేసి, ఆపైన వ్యవహరించడం దొరల నుంచి సంక్రమించిన ముదనష్టపు ఆచారం. ఆ ఆచారాన్ని యిప్పటికీ మన పాలకులు పాటిస్తూ వుండటం మనం చూస్తూ వున్నదే. అందువల్ల రూల్స్ పాటించే దొరతనం వారిని, ఆ రూల్సుతోటే జయించాలని రాజావారు నిర్ణయించుకున్నార్రా అబ్బాయ్.

భీమవరంలోనే రాయుడుగారని ప్లీడరుగారు వుండేవారు. ఆయన గాంధేయవాది. స్వాతంత్ర్య సమరంలో,




ఆయన వంతు కీలక పాత్ర ఆయన నిర్వహిస్తున్నటువంటి వ్యక్తి. అదీగాక, రాజావారి కోర్టు వ్యవహారాలన్నీ ఆయనే చూసేవారు.

ఆ రోజుల్లో దొరతనం వారి మీద కేసు దాఖలు చెయ్యడం సామాన్యమైన విషయమేమీ కాదు. దొరతనం వారికి వ్యతిరేకంగా కేసు చేపట్టేటందుకు ఏ ప్లీడరూ ముందుకు వచ్చేవాడు కాదు. ఒకవేళ ఎవరైనా కేసు పెట్టినా, ఆ కేసును ఏ ప్లీడరైనా చేపట్టినా, సదరు కేసుని ఎడ్మిట్ చెయ్యడానికి కోర్టువారు అంగీకరించటం చాలా అరుదైన విషయం. ఎడ్మిట్ చేసినా-ఒక తెల్లదొరకి, అందునా సాక్షాత్తూ కలెక్టరుకి సంబంధించిన వ్యవహారంలో వేలు పెట్టడానికి ఏ నల్లదొరా సాహసించేవాడు కాదురా అబ్బాయ్.

కేసెవరిమీదా! ఆ ఫిర్కాకి తిరుగులేనటువంటి-అధికారాలున్న కలెక్టరైన తెల్లదొరమీద. ఆ కేసు పెట్టింది భారతీయుడైన రాజావారు. ఆ కేసు చేపట్టింది, మరో భారతీయుడైన ప్లీడరు. ఆ కేసుని ఎడ్మిట్ చేసింది భారతీయుడూ, దొరతనం వారి సేవకుడూ అయిన మున్సబు. అబ్బాయ్ మాంచి రసవత్తరంగా వుంది కదూ.

రాజావారి కేసుని ఎడ్మిట్ చేసిన కన్నబాబుగారు కోర్టులో హాజరు కావలసిందిగా రాడ్ దొరగారికి సమన్లు పంపా్రా. రూల్సు పరిమితిలోని వ్యవహారం కనుక హాజరు కాక తప్పలేదురా అబ్బాయ్, రాడ్ దొరగారికి.

రవితేజంబులరయ, మందీమార్బలంతో దొరగారు కోర్టు హాలుకి విచ్చేసా్రా. విచ్చేసిన దొరగారు ఆసనంలో సుకాసీనులయ్యారు. దొరగారిని క్రాస్ ఎగ్జామినేషన్ వెయ్యడానికి రాయుడుగారు లేచారురా అబ్బాయ్. తమకై కేటాయించబడ్డ ఆసనంలో తమ హోదాని ప్రస్ఫుటిస్తూ మరింతగా సర్దుకుని కూచున్నా్రా దొరగారు.

కోర్టు వారికి వందనం చేసాక, కోర్టు హాలులో వున్న వ్యక్తుల కేసి, రాడ్ దొరగారి కేసి, మున్సబుగారికేసి చూసి; పెదాల మీద మెదిలే నవ్వుని పైకి కనిపించనీయకుండా అణిచి పెట్టి, ప్రతివాది అయిన రాడ్ దొరగారు కుర్చీలో కూర్చుని వుండడాన్ని ఆక్షేపించా్రా రాయుడుగారు. దొరగారు లేవడానికి అంగీకరించలేదురా అబ్బాయ్. తాము కలెక్టరు హోదాలో వున్నటువంటి వ్యక్తి కావడం వల్ల ఆసన బద్ధులయి వుండడం సమంజసమే అన్నా్రా. "తాము ఎంత కలెక్టరయినా, కోర్టు వారి దృష్టిలో ప్రతివాది కిందే పరిగణింపబడతారు కనుక క్రాస్ ఎగ్జామినేషన్ చేసే సమయంలో అలా కూచుని వుండడం-అంగ వైకల్యం వున్న వారి విషయంలో మినహాయించి-కోర్టు ధిక్కారంగా పరిగణించబడుతుంది కనక లేచి నిలబడవలసిందే" అని రాయుడుగారు అభ్యంతరం తెలిపా్రా అబ్బాయ్. ఆ వాదన రూల్సు పరిమితిలో వుంది కనుకనూ, మున్సబుగారు ఆ వాదనని ఖండించక పోవటం వల్లనూ లేచి నిలబడక తప్పింది కాదురా దొరవారికి.

ఆ విధంగా కథ రసపట్టులో పడిందిరా అబ్బాయ్.

దొరగ్గారు లేచి నిలబడ్డాక, ప్రతివాదిగా వారు బోనులో నిలబడవలసిందని రాయుడుగారన్నా్రా. అందుకు దొరగారు తీవ్రంగా ప్రతిఘటించారు. తమ హోదా మేరకు, తాము బోనులో నిలబడవలసిన అవసరం లేదన్నా్రా. అది రూల్సుకి వ్యతిరేకం కనుక బోనులో నిలబడక తప్పదని, లేని పక్షంలో క్రాస్ ఎగ్జామినేషన్ చెయ్యడానికి తాము సంసిద్ధులుగా లేమని, రాయుడుగారు ఖరా కండీగా అన్నా్రా అబ్బాయ్.

అబ్బాయ్ దొరలది అసలే తెల్లతోలు, దానికి అవమానం తోడైన కారణంగా పూర్తిగా చెక్కు తీసేసిన కంద దుంపలాగ అయిపోయా్రా పాపం రాడ్ దొరగారు.

దొరగారు మున్సబుగారి కేసి చూసా్రా. ఆ చూపెలా వుందనుకున్నావ్.

దొరగారి తీక్షణ దృక్కులకి లొంగి పోవడానికి మున్సబు హోదాలో కూచుని వున్నది. దొరతనం వారి తాబేదారు కాదాయే. కన్నబాబు గారాయే. ఆయన బ్రిటీషు వారి పాలనా యంత్రాంగంలో కీలకమైన మున్సిఫ్ హోదాలో వున్నటువంటి వ్యక్తి. బానిస కాదురా అబ్బాయ్. రూల్సు పరిధిని దాటే వ్యక్తి కాదు. తన ధర్మాన్ని నిర్వర్తించడంలో జంకే మనిషీ కాదు. ఒకరి మెప్పుకోలుని ఆశించి కానీ, మరొకరి అధికారానికి లొంగి కానీ రూల్సుని అతిక్రమించేటటువంటి మానహీనుడు కాదురా అబ్బాయ్. అందువల్లనే తెల్ల దొరలకి కూడా ఆయనంటే భయంతో పాటు గౌరవం కూడా వుండేది.

రాయుడిగారి వాదన సముచితమైనది కనకనూ, చట్ట పరిధిని అతిక్రమించినటువంటిది కాక పోవటం చేతనూ, బోనెక్కమని రాడ్ దొరగార్ని, కన్నబాబుగారు శాసించా్రా.

కలెక్టరయిన అంతటి రాడ్ దొరగారు విధిలేక గంటు పెట్టుకున్న మొహంతో బోనెక్కా్రా అబ్బాయ్.

ఆ తరువాత కథ చెప్పేదేముందిరా. ధర్మం, నిష్పాక్షికంగా, నిక్కచ్చిగా నిర్ణయించబడింది.

ఆ రోజుల్లో, ఆ వ్యక్తిత్వాలటువంటివిరా అబ్బాయ్.

